క్లుప్తంగా

ఘన సన్మానం



నెల్లూరు(అర్బన్): అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన న్యాయవాది అన్వర్ బాషాను పీఎంపీ అసోసియేషన్ నేతలు మంగళవారం సత్కరించారు. బారాకాస్ సెంటర్‌లో ఆయనకు పూలమాల వేసి బొకేను అందజేశారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శేషయ్య, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, మాలిని, రాఘవులు, శంకర్‌రావు, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, విశ్రాంత ఏఎస్సై మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వంపై ఆగ్రహం



పేరుకుపోయిన మురుగును పరిశీలిస్తున్న కనకాద్రి

నెల్లూరు(బారకాసు): పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తున్న పలువురు శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బందిపై ఎంహెచ్ఓ కనకాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని శ్రీనివాస నగర్, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. వైకుంఠపురంలో నిరుపేదలు నివసించే పక్కా గృహాల వద్ద మురుగు నిల్వ చేరడంపై మండిపడ్డారు. అనంతరం ఆయన మాట్లాడారు. విధుల్లో ఎందుకంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మరోసారి జరిగితే ఉపేక్షించబోమని చెప్పారు. పేదలు నివసించే ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగునకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి (60) మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ తూర్పు వైపున రోడ్డును గుర్తుతెలియని వ్యక్తి దాటుతుండగా, వాహనం ఈ నెల 11న ఢీకొని వెళ్లిపోయింది. చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఆరో వార్డు బిట్ – 2 వీఆర్వో ఆదిలక్ష్మి మంగళవారం ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులను దివ్యాంగుల ఐక్యసంఘం ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. తొలుత మదర్‌థెరిసా జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. దివ్యాంగుల ఐక్యసంఘం, బ్లాక్ బోర్డు మిత్రమండలి, అమ్మ అంధుల అక్షరదీప అధ్యక్షులు సనావుల్లా, ప్రసాద్, జక్కావుల్లా, అలీయా, అక్షయ్‌కుమార్, జిలానీ, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

టైరు పగిలి అదుపుతప్పిన కారు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: టైరు పగిలి కారు అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన పట్టణంలోని ముంబై జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వేణు నెల్లూరు నుంచి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో పట్టణ సమీపంలో టైరు పగిలిపోవడంతో డివైడర్‌ను కారు ఢీకొంది. కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతినింది. ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడ్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై సంతోష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి ప్రతిమలవైపే మొగ్గు

- ఆరోగ్యం, ఆనందానికి ఇవే మేలు
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దంటున్న నిపుణులు
- వినాయక చవితి నేడు



మట్టి వినాయక ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్న మహిళ

నెల్లూరు(బారకాసు): వినాయక చవితి పర్వదినమంటేనే ఓ ఉత్సాహం. ఇళ్లు, వీధుల్లో గణనాథుడి ప్రతిమలను కొలువుదీర్చి పూజలు చేయడం పరిపాటి. గతంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రూపొందించిన విగ్రహాలనే ఎక్కువగా ప్రతిష్టించేవారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల్లో విస్తృత అవగాహన రావడంతో మట్టి ప్రతిమలవైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రతిమల పంపిణీ.. ఉచితంగా

పర్యావరణ హితం కోరే పలు స్వచ్ఛంద, విద్యా సంస్థలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో వినాయక మట్టి ప్రతిమలను ఉచితంగా అందజేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. నెల్లూరు నగరం, రూరల్ పరిధిలో వేలాదిగా వీటిని అందజేశారు. మండపాల్లో మాత్రం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలనే ఎక్కువగా ఉంచుతున్నారు. మరోవైపు పర్యావరణానికి పెద్దపీట వేస్తూ మట్టితో అందమైన వినాయక ప్రతిమలను తయారు చేస్తున్నారు. భక్తుల అభిరుచి మేరకు విగ్రహాలు, చిన్న ప్రతిమలను తయారు చేసి తుది మెరుగులు దిద్దుతున్నారు.

మట్టి విగ్రహాలే మేలు



మట్టి విగ్రహాలే పూజకు శ్రేష్ఠం. రసాయనాలతో తయారు చేసిన పీఓపీ విగ్రహాలను చెరువులు, నదుల్లో నిమజ్జనం చేస్తే నీరు కలుషితమవుతుంది. దీంతో పర్యావరణానికి హాని కలగడంతో పాటు ప్రజలు, పశువులు తదితర జీవరాసులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయి. మట్టి విగ్రహాలనే ప్రతి ఒక్కరూ పూజించాలి.

– రమణయ్య, జనరల్ ఫిజీషియన్, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల

పీఓపీ విగ్రహాలనే వాడుతున్నారు



పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో రసాయనాలతో తయారు చేసే విగ్రహాలనే వాడుతున్నారు. దీని వల్ల వచ్చే అనర్థాలపై అధికారులు అవగాహన కల్పించాలి.

– సుబ్బారెడ్డి, బంగ్లాతోట

పర్యావరణాన్ని కాపాడుకుందాం



రసాయనాలతో తయారు చేసే ప్రతిమలను కాకుండా మట్టి వినాయకుడ్ని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం. నేను జన్మించిన గ్రామంలో అధికంగా కుమ్మరులు ఉండటంతో అందరికీ మట్టి వినాయక ప్రతిమలనే అందజేస్తారు.

– వసంతలక్ష్మి, చైర్‌పర్సన్, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్

ప్రిస్క్రిప్షన్ లేకుండా స్కానింగ్ చేస్తే చర్యలు



అనాటమీ అసోసియేట్ ప్రొఫెసర్ స్వర్ణలతారెడ్డి, పీడియాట్రీషియన్ కరిముల్లా, డీఐఓ ఉమామహేశ్వరి, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా స్కానింగ్ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సలహా సంఘ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు స్కానింగ్ పరీక్షలను రాయకూడదని చెప్పారు. స్కాన్ పరీక్షల వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని కోరారు. భ్రూణ హత్యలను జిల్లాలో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. జిల్లా స్థాయీ సలహా సంఘ చైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్,

ప్రాథమిక దశలోనే కుష్టును గుర్తించాలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధిని గుర్తిస్తే తగు చికిత్స చేయడం ద్వారా నయం చేసి అంగవైకల్యం రాకుండా కాపాడొచ్చని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. కుష్టు నియంత్రణ చర్యలపై సెక్టార్ వారీగా జిల్లా వైద్య శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ నెల్లో కొత్తగా నమోదైన కేసులపై ఆరాతీశారు. అవసరమైన వారికి ఎమ్సీఆర్ చెప్పులు, కొబ్బరి నూనె, టవళ్లు తదితరాలను అందజేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం





నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో గల అనివెట్టి మండపంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

యూపీహెచ్‌సీలో తనిఖీ



నెల్లూరు(అర్బన్): నగరంలోని చాకలివీధిలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర కేసుల వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ల్యాబ్ టెక్నీషియన్లతో మాట్లాడారు. రక్త పరీక్షలను వేగంగా, నాణ్యవంతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం రాయాజీవీధిలో చేపట్టిన లార్వా సర్వేను తనిఖీ చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్ర కోఆర్డినేటర్ తిరుపతయ్య, హెల్త్ అసిస్టెంట్ పెద్దయ్య, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి నజీరా తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ పూజితను నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. నేతలు స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, యేసునాయుడు, లంకా రామశివారెడ్డి, కొండేటి నరసింహరావు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులను పూర్తి చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. హరనాథపురం కూడలిలో చేపట్టిన అభివృద్ధి, రామలింగాపురం అండర్ బ్రిడ్జి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రాంగణ పరిసరాల్లో మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రతను చేపట్టాలని సూచించారు.

రోడ్డు ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలోపు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

➡ నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి విలువైన సూచనలను ఆహ్వానిస్తున్నామని ఈఆర్వో నందన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సెస్సార్‌కు సంబంధించి పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై పరిష్కారాన్ని అందించామని తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి ధనుంజయ్, సంజయ్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, టీడీపీ తరఫున చాట్ల నరసింహరావు, అజయ్‌రెడ్డి, సీపీఎం నుంచి కత్తి శ్రీనివాసులు, బీఎస్పీ తరఫున సాయిరామ్, నెల్లూరు అర్బన్ ఎన్నికల డీటీ ఆనంద్, నగరపాలక సంస్థ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా లక్ష్మీనృసింహుడి కల్యాణోత్సవం



హాజరైన భక్తులు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరానికి అనుబంధంగా ఉన్న సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయిలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. కల్యాణాన్ని వేదపండితులు వేదగిరి ఫణిశర్మస్వామి, తారకేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం, అక్షతలు తదితరాలను అందజేశారు. ఉభయకర్తలుగా నూకల రవీంద్రనాథ్ టాగూర్, బాలాసీతామహాలక్ష్మి, సర్రాజు మురళీధర్‌రావు, అన్నపూర్ణ దంపతులు, కృష్ణగిరి దేశ్‌పాల్‌సింగ్, దేవకిదేవి, ఏల్చూరి రామకృష్ణ, రేవతి దంపతులు వ్యవహరించారు. మందిర చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'

కొడవలూరు: సీసీఆర్ కార్డులను పొందడం ద్వారా కౌలు రైతులకు ప్రభుత్వ గుర్తింపు లభిస్తుందని ఏఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని రామన్నపాళెం, ఆలూరుపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీపీ జిల్లా అధ్యక్ష ఎన్నికపై సమావేశం

నెల్లూరు సిటీ: టీడీపీ నెల్లూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నికపై సమావేశాన్ని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ముదిరాజ్ సంఘీయుల వృత్తిని మత్యకార వృత్తిగా గుర్తించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ కోరారు. ఈ మేరకు నగరానికి వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పేద ముదిరాజ్‌లు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వ రాయితీలు అందడంలేదని చెప్పారు. నేతలు అనిల్‌కుమార్, కృష్ణయ్య, రమణయ్య, రాఘవేంద్ర, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక వ్రతకల్పం అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వినాయక చవితిని పురస్కరించుకొని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వాకర్స్‌కు వినాయక వ్రతకల్పం పుస్తకాలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెజవాడ సుధీర్‌రెడ్డి సౌజన్యంతో మంగళవారం పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నేతలు రాఘవేంద్రశెట్టి, స్వర్ణా రమేష్‌బాబు, సుబ్బరాజు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

నెల్లూరు సిటీ / నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వినాయక చవితి పర్వదినాన్ని సుఖ సంతోషాలతో జరుపుకోవాలని పలువురు కాంక్షించారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలను మంగళవారం విడుదల చేశారు.

'హౌసింగ్‌లో నాసిరక నిర్మాణాలు'

నెల్లూరు(అర్బన్): నాసిరక నిర్మాణాలతో పాటు సిమెంట్, స్టీల్‌ను కాంట్రాక్టర్లు, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కలిసి విక్రయించి సొమ్ము చేసుకున్నారని బీజేపీ నేత మిడతల రమేష్ ఆరోపించారు. ఈ మేరకు కొండ్లపూడి హౌసింగ్ లేఅవుట్‌ను పార్టీ కార్యకర్తలతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ అవినీతిపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదును పంపానని చెప్పారు.

నేత్రదానం



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న విజయమ్మ

నెల్లూరు(అర్బన్): వనంతోపులో నివాసముంటున్న నూకలపాటి రాఘవరెడ్డి (76) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింహపురి దేహదాన సమర్పణ సంస్థ కన్వీనర్లు విజయమ్మ, భారతి మృతుడి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు ప్రభుత్వ పెద్దాస్పత్రికి మృతుడి నేత్రాలను దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు.

గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ హర్షణీయం

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి ఉత్సవాలకు ఉచిత విద్యుత్‌ను అందించడంపై విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని టీవీఎస్ కల్యాణసదన్‌లో విలేకరులతో ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ మంగళవారం మాట్లాడారు. శోభాయాత్ర ద్వారా గణేశ్ ఘాట్‌లో ఈ నెల 31న నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. ఉత్సవ సమితి నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్, ఫణిరాజు, నాగిరెడ్డి, శ్రీకంఠం రమణయ్య, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వినాయక.. జయహో



నెల్లూరు(బృందావనం): విహంగ వీక్షణ వినాయకుడ్ని భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తీర్చిదిద్దారు. నాలుగడుగుల పొడవు, నాలుగడుగుల వెడల్పు, అడుగు ఎత్తు ఉన్న విమానాన్ని తయారు చేశారు. మూడు రోజులు శ్రమించి రూపమిచ్చానని ఆయన చెప్పారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినాయక చవితి పర్వదినం సందర్భంగా బుధవారం సెలవైనా విద్యుత్ బిల్లులను యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ విజయన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వసూలు కేంద్రాలు పని చేయనున్నాయని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.